


మనోజ్‌చంద్రను అభినందిస్తున్న నర్సింహారావు

## శభాష్.. మనోజ్ చంద్ర

అమెరికా చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన హైదరాబాదీ

రామంతాపూర్, ఏప్రిల్ 28: అమెరికాలోని చికాగో ఆంధ్ర అసోసియేషన్ (సీఏఏ) 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన మనోజ్ చంద్ర కొంపల్లి విజేతగా నిలిచాడు. వరుసగా రెండవ ఏడాది మనోజ్ ఈ చెస్ టోర్నమెంట్లో పాల్గొని విజేతగా నిలవడం విశేషం. చికాగోలోని నేపర్ విల్లేలో పెద్ద సంఖ్యలో తెలుగు వారు హాజరైన సీఏఏ వేడుకల సందర్భంగా చికాగో ఆంధ్ర అసోసియేషన్ ప్రతినిధులు,డైరెక్టర్ స్పోర్ట్స్ నర్సింహారావు.. మనోజ్ చంద్రకు ట్రోఫీ అందజేశారు.

## కాలేయ వ్యాధి బాధితులకు కేసీఆర్ పథకం ఆపన్న హస్తం

- 2015లో లివర్ ట్రాన్స్‌ప్లాంట్, జీఐ కాంప్లెక్స్ సర్జరీలను ఆరోగ్య శ్రీలో చేర్చిన బీఆర్ఎస్ సర్కార్
- క్లిష్టమైన సర్జరీలతో రికార్డులు బ్రేక్ చేస్తున్న ఉస్మానియా వైద్యులు
- ఇప్పటివరకు 42మందికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు
- ఖరీదైన వైద్యానికి పేదల చెంతకు చేర్చిన కేసీఆర్

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): 'ఇది చాలా అరుదైన రుగ్మత...ఇలాంటి వ్యాధిగ్రస్తులకు చికిత్స చేయడం చాలా కష్టం.. ఈ సర్జరీ మేము చేయలేం..ఈ సర్జరీకి విదేశాల నుంచి వైద్యులను పిలిపించాల్సి ఉంటుంది... డబ్బు చాలా ఖర్చవుతుంది.. అయినా రోగి ప్రాణాలకు భరోసా ఇవ్వలేం..' అంటూ పేరున్న కార్పొరేట్ దవాఖానలు చేతులెత్తేసిన ఎంతోమంది రోగులను అక్కున చేర్చుకుంటూ.. వారి ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నారు ఉస్మానియా వైద్యులు. అన్ని రకాల హంగూ, ఆర్భాటాలతో ఆకర్షించే కార్పొరేట్ దవాఖానల్లో సైతం సాధ్యంకాని అరుదైన, అత్యంత క్లిష్టమైన కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులకు, ముఖ్యంగా చిన్నారులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు జరుపుతూ ప్రపంచ స్థాయి రికార్డులు బ్రేక్ చేస్తున్నారు



ఉస్మానియా వైద్యులు. నిత్యం వందలు, వేల సంఖ్యలో వచ్చే రోగుల తాకిడి ఉన్నప్పటికీ పని ఒత్తిడిని సైతం లెక్కచేయకుండా గంటల తరబడి సమయం వెచ్చించి, వైద్యులు, నర్సింగ్ అధికారులు, టెక్నీషియన్స్, పారా మెడికల్ తదితర అన్ని రకాల బృందాలను సమన్వయం చేసుకుని ఒక టీమ్‌వర్క్‌తో ముందుకు వెళ్లడంతోనే ఇలాంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేయడం సాధ్యమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

### అభయహస్తంగా కేసీఆర్ పథకాలు

అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో గుండె మార్పిడి తరువాత అత్యంత ఖరీదైన వాటిల్లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సనే. కార్పొరేట్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు రోగి ఆరోగ్య స్థితి ఆధారంగా సుమారు రూ.30లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఖర్చవుతుంది. దీనికి తోడు కాలేయ సంబంధిత వ్యాధులకు అవసరమైన శస్త్రచికిత్సలు సైతం ఖరీదైనవే. పైగా కాలేయ మార్పిడి తదితర శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు జీవితాంతం కొన్ని రకాల మందులను వాడాల్సి ఉంటుంది. ఈ మందులు కూడా చాలా ఖరీదైనవి. ఇంత ఖర్చు భరించే ఆర్థిక స్థోమత లేక చాలామంది రోగులు ఉన్న ఆస్తులను అమ్ముకుని రోడ్డు పాలవగా మరికొంతమంది ఆస్తులు కూడా లేని రోగులు చేసేది లేక ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి. దీనికి చలించిన నాటి కేసీఆర్ సర్కార్ ఖరీదైన వైద్యాన్నినిరుపేదలకు అందించాలనే ఉద్దేశంతో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలతో పాటు ఖరీదైన చికిత్సలను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో ప్రతి ఏటా వేలాది మంది నిరుపేదలు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలతో పాటు పలురకాల ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా పొందుతున్నారు.

### అరుదైన చికిత్సలతో ప్రపంచ రికార్డులు

అరుదైన శస్త్రచికిత్సలతో ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో, మెడికల్ గ్యాస్ట్రో వైద్యనిపుణులు ప్రపంచ రికార్డులకు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఈ క్రమంలోనే 2018లో ఆటో లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా జరిపి ప్రపంచ రికార్డు సృష్టించారు. 6 వారాల వయస్సు గల చిన్నారికి కాలేయానికి రక్తం సరఫరా చేసే రక్తనాళాలు సరిగ్గా వృద్ధి చెందకపోవడంతో సదరు రోగి కాలేయాన్ని తొలగించి, కొంతసేపు బయట పెట్టి, రక్తనాళాలను పునరుద్ధరించిన తరువాత అదే కాలేయాన్ని తిరిగి అమర్చినట్లు ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. ఈ తరహా సర్జరీ ప్రపంచంలోనే తొలిసారిగా కెనడాలో చేయగా 2018లో రెండోసారి ఉస్మానియా వైద్యులు చేసి రికార్డు సృష్టించారు. 'అలిగెలి సిండ్రోమ్‌తో పాటు గుండె సమస్య ఉన్న రెండేండ్ల వయస్సుగల చిన్నారికి సైతం ఉస్మానియా వైద్యులు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. తాజాగా అరుదైన మార్ఫన్ రుగ్మతతో పాటు కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 14 ఏళ్ల బాలుడికి కాలేయ మార్పిడి జరిపి మరోసారి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ తరహా అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలన్నీ ఆరోగ్యశ్రీ పథకం కిందనే పైసా ఖర్చులేకుండా నిర్వహించారు.

### సమష్టి కృషితోనే శస్త్ర చికిత్సలు



ఉస్మానియా ఆసుపత్రిలో ఇటీవల 14ఏళ్ల బాలుడికి జరిపిన కాలేయ మార్పిడి శస్త్రచికిత్స ప్రపంచంలోనే మొట్టమొదటిది. 2015నుంచి ఉస్మానియాలో అత్యంత క్లిష్టమైన కేసులకు కూడా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీస్ చేస్తున్నాం. ఇప్పటి వరకు 42 లివర్ ట్రాన్స్‌ప్లాంట్స్ చేశాం. అంతేకాకుండా 5వేల మంది రోగులకు జీఐ కాంప్లెక్స్ సర్జరీలు, 300 లివర్ క్యాన్సర్ సర్జరీలను విజయవంతంగా జరిపాం. ఈ సర్జరీలన్నీ పైసా ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తి ఉచితంగానే నిర్వహించాం. ఉస్మానియా సూపరింటెండెంట్ డా.రాకేష్ సాహె, తోటి వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, దవాఖానలోని ఇతర అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఈ విజయాలు సాధించగలుగుతున్నాం.

– డా.మధుసూదన్, సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి, ఉస్మానియా ఆసుపత్రి




ఇది అధికారిక వెబ్‌సైట్ కాదంటూ అదే నకిలీ ఖాతాలో పోస్టు

## హవ్వ.. ఇదేం పని హైడ్రా!

- హైడ్రా అధికారిక ఎక్స్ అకౌంట్‌లో మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రేలాపనలు
- కొద్దిసేపటికే అది అధికారిక సైట్ కాదంటూ రాతలు
- అనధికారిక సైట్లలో ప్రభుత్వలోగోలు వాడొచ్చా?
- సీనియర్ ఐపీఎస్ అధికారి చూస్తూ ఊరుకుంటారా..
- హైడ్రా రంగనాథ్‌కు రాజకీయాలెందుకు..?
- కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం ఎప్పుడు తీసుకున్నారు..
- ఐపీఎస్ అధికారికి ఇలాంటి పనులెందుకు
- సోషల్ మీడియాలో నెటిజన్ల మండిపాటు

సిటీబ్యూరో, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ): హైడ్రా అధికారిక సోషల్ మీడియాలో మాజీ సీఎం కేసిఆర్‌ను విమర్శిస్తూ పెట్టిన పోస్టులపై నెటిజన్లు మండిపడుతున్నారు. వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ హైడ్రాపై చేసిన వ్యాఖ్యలను హైడ్రా టీజీ పేరుతో ఉన్న అకౌంట్‌లో కోడ్ చేస్తూ కేసీఆర్‌ను విమర్శించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో హైడ్రాపై నోరుపారేసుకున్న సీఎం కేసీఆర్, నిజాలు తెలుసుకోకుండా అవాస్తవాలు మాట్లాడిన కేసీఆర్, అవగాహనారాహిత్యంతో మాట్లాడి స్థాయిని దిగజార్చుకున్న కేసీఆర్' అంటూ హైడ్రా వారియర్స్ పేరుతో ఉన్న ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు. దీనిపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయితే ఆ పోస్ట్‌కు వస్తున్న కామెంట్లతో పాటు సాధారణ ప్రజల్లో కూడా హైడ్రా తీరుపై చర్చ జరుగుతోంది. 'హైడ్రాచర్యల పట్ల కోర్టు చివాట్లు పెట్టలేదా.. మీరు ఇంకా మారరా' అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. 'అసలు రంగనాథ్ ప్రజల కోసం పనిచేస్తున్నారా.. రేవంత్‌రెడ్డి కోసమా.. ఇలాంటి చెత్త రాతలెందుకంటూ' సోషల్ మీడియా వేదికగా హైడ్రా కమిషనర్‌పై విరుచుకుపడుతున్నారు.

### నకిలీ ఖాతా అయితే ఫిర్యాదు ఎందుకు చేయలేదు..?

అయితే హైడ్రా ఫ్యాక్ట్ చెక్ చేసి ఈ అకౌంట్ అఫీషియల్ హ్యాండిల్ కాదంటూ పెట్టుకున్నారు. అయితే అది అధికారిక సైట్ కానప్పుడు ప్రభుత్వ లోగోలు ఎలా వాడతారనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ విషయంలో హైడ్రా ఎటువంటి ప్రకటన చేయకపోయినా అఫీషియల్ హ్యాండిల్ కాదంటూ బ్యానర్‌లోనే పోస్ట్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో నడుస్తున్న హైడ్రా అధికారిక ఎక్స్ హ్యాండిల్ ఉండగానే మరో అకౌంట్ రావడం అది కూడా హైడ్రా టీజీ పేరుతో వచ్చి అందులో హైడ్రా లోగోలు వాడుతుంటే రంగనాథ్ ఎలా చూస్తూ ఊరుకుంటున్నారు.. హైడ్రా పేరుతో ఇలా నకిలీ ఖాతాలు వస్తే ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదంటూ నెటిజన్లు ప్రశ్నలమీద ప్రశ్నలు కురిపిస్తున్నారు. ఒక ప్రభుత్వ శాఖ అధికారిక అకౌంట్లో ఆ భాష ఏంటని, ఆల్ ఇండియాసర్వీసెస్ కండక్ట్ రూల్‌బుక్‌లోని రూల్ 5లో ఒక ఐపీఎస్ అధికారి ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా పనిచేయవద్దని, ఏ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని రంగనాథ్‌కు తెలియదా అంటూ నెటిజన్లు మండిపడ్డారు. హైడ్రా పేరిట నకిలీ ఖాతాలు ఉంటే ఎందుకు ఫిర్యాదు చేయలేదని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.

### ఇంత ఘోరమైన అబద్ధాలా..

గంట కింది వరకు అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌గా ఫోజులు కొట్టిన హైడ్రా టీజీ హ్యాండిల్ తాను ప్రశ్నించగానే అకస్మాత్తుగా బయో ఎందుకు మార్చారంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ సోషల్‌మీడియా విభాగం ఇన్‌చార్జ్ కొణతం దిలీప్ ప్రశ్నించారు. ఒక సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ అయిన రంగనాథ్ ఆధ్వర్యంలో నడిపే హైడ్రా విభాగం మరీ ఇంత ఘోరంగా అబద్ధాలు ఆడుతుంటే ఆయన ఎలా చూస్తూ ఊరుకుంటున్నారంటూ దిలీప్ ట్వీట్ చేశారు. హైడ్రా టీజీ హ్యాండిల్‌కు అనుబంధంగా పని చేస్తున్న వాట్సప్, ఇన్‌స్టాగాం హ్యాండిల్, యూట్యూబ్ చానెల్ అన్నీ అనధికారికమైనవేనా.. మరి ప్రభుత్వ ఎంబ్లమ్స్ వాడి అనధికారిక అకౌంట్లు నడుపుతుంటే ఒక ఐపీఎస్ అధికారి అయిన రంగనాథ్ కనీసం గమనించలేదా అంటూనే ఈ ట్విట్టర్ అకౌంట్‌లో పోస్టు చేస్తున్న పోస్టర్లలో ఉన్న ఫోన్ నెంబర్ ట్రూకాలర్‌లో కొడితే హైడ్రా తెలంగాణ అని వస్తుందని, ఇదే నెంబర్‌తో అనేక వాట్సప్ గ్రూపుల్లో హైడ్రా వీడియోలు, సమాచారం షేర్ చేస్తున్నారని, ఇవేవీ కూడా హైడ్రాకు చెందినవి కాదా అని రంగనాథ్‌ను ట్విట్టర్ వేదికగా కొణతం అడిగారు. అయినా హైడ్రా పేరుమీద అనేకమంది వసూళ్లు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఆరోపిస్తున్న సమయంలో హైడ్రా పేరుతో ఈ ఆకతాయి చేష్టలేంటంటూ మండిపడ్డారు. ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను నడుపుతున్నారని, అది పోలీస్ శాఖతో సమానమైనదని, మరి ఆ శాఖ పేరు మీద ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సోషల్‌మీడియా ఖాతాలు నడుపుతుంటే మీరెందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ కొణతం దిలీప్ హైడ్రా కమిషనర్‌ను ప్రశ్నించారు. ఈ సోషల్ మీడియా అకౌంట్లు, ఫోన్‌నెంబర్ హైడ్రావా లేక కాంగ్రెస్ పార్టీవా కొంచెం వివరణ ఇవ్వాలంటూ రంగనాథ్‌ను కొణతం కోరారు.

## మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం కృషి

మంత్రి సీతక్క




స్త్రీ శక్తి అవార్డులను అందజేస్తున్న మంత్రి సీతక్క

మాదాపూర్, ఏప్రిల్ 28: మహిళలు తలుచుకుంటే అసాధ్యాలను.. సుసాధ్యం చేయగలరని మంత్రి సీతక్క అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సోమవారం టీసీఈఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్త్రీ శక్తి అవార్డ్స్ 2025' కార్యక్రమాన్ని మంత్రి సీతక్క జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక, సృజనాత్మక పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ... స్త్రీ శక్తి అవార్డ్స్ వంటి కార్యక్రమాలు మహిళలు ఉన్నత స్థానాల్లోకి రావడానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 250 మందికి పైగా మహిళలు దరఖాస్తు చేయగా 4 విభాగాల్లో 50 మంది మహిళలు ఎంపికయ్యారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ సీఈవో దివ్య దేవరాజన్, టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు, స్త్రీశక్తి అవార్డ్స్ కన్వీనర్, మిల్లెట్ బ్యాంక్ వ్యవస్థాపకురాలు విశాల రెడ్డి తదితరులు ఉన్నారు.

## నొవాటెల్‌లో సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్




సిటీ బ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): హెచ్ఐసీసీ నొవాటెల్‌లో సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు హైలైఫ్ ఎగ్జిబిషన్ ఎండీ అబి డొమినిక్ తెలిపారు. ఈ సమ్మర్ స్పెషల్ ఎడిషన్‌ను ప్రముఖ సినీతార హెబ్బా పటేల్‌తో పాటు పలువురు సెలబ్రిటీలు, ఫ్యాషన్ ప్రియులు పాల్గొని ప్రారంభించారని చెప్పారు. 28న ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ 30వ తేదీ వరకు కొనసాగనున్నట్లు వెల్లడించారు. ఫ్యాషన్, గ్లామర్, స్టైల్, లగ్జరీ దుస్తులతో పాటు క్రియేటివ్ ఫ్యాషన్ వేర్, లైఫ్ స్టైల్ వేర్, బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్, యాక్ససరీస్, జ్యూయలరీస్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

## జీతాలు చెల్లించకుంటే ఆందోళనలు ఉధృతం

కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 28: గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని సోమవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీతాలు లేకుండా కార్మికులు ఎలా బతకాలి అని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, గ్రామ పంచాయతీ కార్మికుల నాయకులు సుధాకర్, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్




అర్జీలు స్వీకరిస్తున్న జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై నేరుగా వినతులు స్వీకరించారు. మొత్తం 67 వినతులు రాగా అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 33, ట్యాక్స్ సెక్షన్ 9, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాలకు 3 చొప్పున, అడ్మినిస్ట్రేషన్ శానిటేషన్, ఫైనాన్స్, విభాగాలకు రెండు చొప్పున హెల్త్, విజిలెన్స్ ఎలక్షన్స్, యుబీడీ, లేక్స్, వెటర్నరీ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదుల అందగా ఫోన్‌ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 113 ఆర్జీల స్వీకరించారు. కూకట్‌పల్లి జోన్‌లో 42, శేరిలింగంపల్లిలో 12, ఎల్బీనగర్ జోన్‌లో 11, సికింద్రాబాద్‌లో 40, చార్మినార్‌లో 5, ఖైరతాబాద్‌లో మూడు ఆర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు చంద్రకాంత్‌రెడ్డి, సరోజ, వేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి రావు, రఘు ప్రసాద్, గీతా రాధిక, సత్యనారాయణ, అడిషనల్ సీసీపీలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్ ప్రజావాణికి 80 దరఖాస్తులు

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 80 దరఖాస్తులను స్వీకరించారు. హౌసింగ్ 25, పింఛన్ 19, రెవెన్యూ 15, ఇతర శాఖలకు సంబంధించిన 21 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ జీ ముకుందరెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓ రామకృష్ణ, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆ మూడే సమాఖ్యవాదానికి పునాదులు

సీనియర్ అడ్వకేట్ సీఎస్ వైద్యనాథన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలే సమాఖ్యవాదానికి బలమైన పునాదులని ప్రముఖ న్యాయనిపుణులు పేర్కొన్నారు. చెన్నయ్‌లోని శస్త్ర డీమ్డ్ యూనివర్సిటీ కాలేజీ కళాశాలలో లాజికల్ కనెక్ట్ పేరిట ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ సదస్సులో సీనియర్ అడ్వకేట్ సీఎస్ వైద్యనాథన్ మాట్లాడుతూ.. సామాజిక మౌలిక వసతుల కల్పనలో పన్ను వినియోగం ఎంతో కీలకం అన్నారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన జీవనం అందుతుందన్నారు. ప్రొ.అర్ఘ్య సేన్ గుప్తా మాట్లాడుతూ.. ఈ మూడు వ్యవస్థలతో సమర్థవంతమైన పాలన అందుతుందన్నారు. సదస్సులో న్యాయ నిపుణులు అర్వింద్ దత్తార్, అమృత్ భార్గవ్, లీగల్ స్కాలర్లతోపాటు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనివవర్సిటీ వైస్ ఛాన్సలర్ డా.వైద్య సుబ్రమణ్యం స్వాగతోపన్యాసం చేశారు.




## అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల మరియు షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ కులాలపై దాడులు, వివక్షకు సంబంధించిన కేసుల పరిణామాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) కేసులను త్వరగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డీసీపీలు.. పద్మజ, ప్రవీణ్ కుమార్, అక్షంష్ యాదవ్, అరవింద్ బాబు, ఇందిర, జీ నర్సింహారెడ్డి, డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజేందరరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవయవ మార్పిడికి గాంధీ సిద్ధం

- 2022లో రూ.35 కోట్లతో అవయవ మార్పిడి కేంద్రం పనులను ప్రారంభించిన అప్పటి మంత్రి హరీశ్‌రావు
- బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పనులు పూర్తి
- ఆపై పనులను నిలిపివేసిన కాంగ్రెస్ సర్కార్
- ప్రతిపక్షాలు, రోగుల ఒత్తిడికి దిగివచ్చిన రేవంత్ ప్రభుత్వం
- పనుల్లో పురోగతి.. త్వరలో ఆపరేషన్ థియేటర్ల ప్రారంభం!

### ఫలితమిస్తున్న కేసీఆర్ సంకల్పం




సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): పేద రోగులకు ఉచితంగా అవయవ మార్పిడి చేసేందుకు గాంధీ ఆసుపత్రి సిద్ధమవుతోంది. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయానికి అవయవ మార్పిడి కేంద్రం జీవం పోయనుంది. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో నిర్మించిన ఆరు థియేటర్లు నిర్మాణపు పనులు 95శాతం పూర్తయి అతి త్వరలోనే ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పేదోడికి ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో గడిచిన పదేళ్లు కేసీఆర్ సర్కార్ సంకల్పించి, జీవం లేక శిథిలమవుతున్న సర్కార్ దవాఖానలను కార్పొరేట్ స్థాయిలో మార్చింది.

వాటిలో ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలందించేందుకు అనునిత్యం కృషి చేసింది. ఇందులో భాగంగానే గాంధీ ఆసుపత్రిలో నోడల్ అవయవదాన మార్పిడి కేంద్రాన్ని రూ.35 కోట్లతో నెలకొల్పేదుకు 2022లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

### పేదవాడికి ఉచిత వైద్యమే లక్ష్యంగా..

కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తుల వంటి అవయవ మార్పిడికోసం రూ.లక్షల్లో అప్పులు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవయవ మార్పిడిలు చేయించుకోవడం గమనించిన కేసీఆర్ అవసరమైన ప్రతి పేదోడికి ఉచితంగా అవయవమార్పిడి సేవలందించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే నాటి వైద్యారోగ్యశాఖ మంత్రి టీ.హరీష్ రావు.. గాంధీ ఆసుపత్రిలోని 8వ అంతస్తులో అవయవమార్పిడి కేంద్రం ప్రారంభించేందుకు వెనువెంటనే రూ.35కోట్లు మంజూరు చేశారు. అప్పటినుంచి పనులు చకచకా సాగుతుండగా, ప్రభుత్వం మారడంతో మధ్యలో కాస్త నిలిచిపోయాయి. రోగుల అవస్థలు గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆయా పనులను పూర్తిచేసేందుకు సిద్ధమైంది. ప్రస్తుతానికి 95శాతం పనులు పూర్తికాగా మరో పదిహేను రోజుల్లో గాంధీలోని అవయవ మార్పిడి కేంద్రం అందుబాటులోకి రానుంది.

### అధునాతన పద్ధతుల్లో ఆరు థియేటర్లు..

గాంధీలోని ఆధునిక అవయవ మార్పిడి కేంద్రంలో లివర్, మూత్రపిండాలు, కాలేయం, గుండె వంటి అవయవాల మార్పిడికోసం ఆరు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒకేసారి మూడు వివిధ రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించవచ్చు. అధునాతన హంగులతో నిర్మించిన ఈ అవయవ మార్పిడి కేంద్రంలో సెమినార్ హాల్ నెలకొల్పారు. వైద్య విద్య అభ్యసించే పీజీ విద్యార్థులకు వైద్య విద్యలో భాగంగా ఆపరేషన్ థియేటర్‌లో నిర్వహించే అవయవ మార్పిడి చికిత్సను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేశారు. వీటిలోనే నేరుగా దాత నుంచి గ్రహీతకు అవయవాన్ని అమర్చనున్నారు. ఐసీయూ ట్రాన్స్‌ప్లాంటేషన్ గదులు, అబ్జర్వేషన్ రూములు, అవయవ మార్పిడి చికిత్సలందించే కార్డియాలజీ, పల్మనాలజీ, నెఫ్రాలజీ, హెపటాలజీ మొదలైన ఆయా విభాగాల వైద్యులకు సైతం గదులను ఇందులోనే కేటాయించారు. ఆటోమెటిక్‌గా తెరుచుకునే తలుపులు, బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు లోపలికి రాకుండా నిలువరించేందుకు అవసరమైన పరికరాలను సైతం అమర్చారు.

### సామాన్యుడికి చేరువగా..

అవయవ మార్పిడి చికిత్సకోసం సామాన్యుడు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరితే రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. కిడ్నీ మార్పిడికి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు, కాలేయం మార్పిడి రూ.25 లక్షల నుంచి రూ.38 లక్షలవరకు, గుండె మార్పిడికి రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు, ఊపిరితిత్తులమార్పిడికి రూ.20లక్షల నుంచి రూ.25 లక్షల వరకు డబ్బులు కట్టించుకొని సామాన్యులను ముప్పుతిప్పలు పెడుతున్నారు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు. అయితే గాంధీలో ఈ కేంద్రం అందుబాటులోకి రావడం వల్ల సామాన్యుడు ఉపశమనం పొందుతాడు. అలాగే కేంద్రం ఏర్పాటుతో కేసీఆర్ తరతరాలకు చిరస్థాయిలో నిలిచిపోతారు.